క్లుప్తంగా

నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నడివీధి గంగమ్మతల్లి

పుల్లంపేట: పుల్లంపేట మండలం, సీతారాంపేట గ్రామంలో వెలసిన నడివీధి గంగమ్మతల్లికి గురువారం గ్రామంలో భారీ సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడాదికి ఒకరోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పొంగళ్లు పెట్టుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో గురువారం అమ్మవారిని ప్రజలు దర్శించుకొని పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న బోగా వెంకటరామయ్య

పుల్లంపేట: పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభా హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కె.హరిప్రియ, ఎం.లావణ్య, ఎం.సంకీర్త, ఎ.హరిబిందు, ఎం.రామయ్య అనే విద్యార్థులకు బోగా వెంకటరామయ్య రూ. 31 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ నూకల శ్రీరాములు మాట్లాడుతూ ఈ నగదు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి ప్రతాప్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ



పాఠ్యాంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న విద్యాశాఖాధికారి

సంబేపల్లి : మండల పరిధిలోని యర్రగుంట్ల సమీపంలోని కేజీబీవీ పాఠశాలను అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ప్రిన్సిపాల్ చర్చించి సకాలంలో పూర్తి చేయించాలన్నారు. పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు.

బాడీ ఫ్రీజర్ బాక్స్ వితరణ



మానవతా సంస్థ, లయన్స్ క్లబ్ సభ్యులకు బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను అందజేస్తున్న దృశ్యం

నందలూరు : మండలానికి చెందిన మండెం సీతారామయ్య గౌడ్ తన సొంత నిధులతో గురువారం మానవతా సేవాసంస్థ, లయన్స్ అండ్ వాకర్స్ క్లబ్ సభ్యులకు బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ మండెం రామమోహన్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసేందుకు మరింత మంది ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ కుర్రా మణి యాదవ్, పోడపోతుల రాము, ఆనాల మధు యాదవ్, గుణ యాదవ్, రామచంద్రయ్య, గంధం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అవధూత నారాయణ స్వామి 75వ వార్షికోత్సవం



అవధూత నారాయణస్వామి

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో వెలసిన శ్రీ అవధూత నారాయణస్వామి 75వ ఆరాధన మహోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం అభిషేకం, మహాగణపతి, స్వస్తి పుణ్యావాచనం, మండపారాధన పూజ, రుద్రాభిషేకం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఉంటాయన్నారు. సాయంత్రం లక్కిరెడ్డిపల్లెకు చెందిన శివసాగర్ బృందంతో కోలాటం, భజన ఉంటుందన్నారు. ఆరాధన ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

చరిత్రాత్మకమైనది రెవెన్యూ వ్యవస్థ

- రాజంపేట ఆర్డీఓ మోహనరావు
- ఘనంగా రెవెన్యూ దినోత్సవం

రాజంపేట: రెవెన్యూ వ్యవస్థ చరిత్రాత్మకమైనదని రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి మోహనరావు అన్నారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభాభవనంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం రాకముందు నుంచి రెవెన్యూ వ్యవస్థ కొనసాగుతోందన్నారు. ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ న్యాయవాది గురుప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్క పౌరసేవకు ముడిపడిన వ్యవస్థ రెవెన్యూ శాఖ అన్నారు. బ్రిటీషు పాలకుల నుంచి రెవెన్యూ వ్యవస్థ అంచెలంచెలుగా నేటి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చెందుతూ వస్తోందన్నారు. రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లో కూడా వందేళ్ల క్రితం ఇక్కడ తెల్లదొరల రెవెన్యూ పాలన కొనసాగిందని చరిత్ర చెబుతోందన్నారు. అనంతరం ఆర్డీఓ కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో రాజంపేట తహసీల్దారు ఇన్బ్రరాజన్, నందలూరు తహసీల్దారు మహబూబ్‌బాషా, సర్వేయర్ల సంఘం నేత వెంకటసుబ్బయ్య, రాజంపేట, నందలూరు మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది, ఆర్‌ఐలు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



రెవిన్యూ దినోత్సవం సందర్భంగా సబ్‌కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న రాజంపేట ఆర్‌డీఓ మోహనరావు



రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

నిత్యం ప్రజలకు అందుబాటులో రెవెన్యూ ఉద్యోగులు

రాయచోటి టౌన్ : అనునిత్యం ప్రజలకు అందుబాటులో నిలుస్తూ ప్రజలకు సేవ చేసేది రెవెన్యూ ఉద్యోగులు మాత్రమేనని రెవెన్యూ ఉద్యోగుల ఏపీజేఏసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహకుమార్ అన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలతో వచ్చే వారి సంఖ్య ఎప్పుడైతే తగ్గుతుందో అప్పుడే రెవెన్యూ వ్యవస్థ పూర్తి స్థాయిలో పని చేసినట్లుగా భావించాలన్నారు. అనంతరం రిటైర్డు రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయం

గాలివీడు : ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవెన్యూ ఉద్యోగులు అందిస్తున్న సేవలు అభినందనీయమని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను, అత్యుత్తమ పనితీరు కనబరిచిన రెవెన్యూ ఉద్యోగులను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలాజీ, సర్వేయర్ తిమ్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా రెవెన్యూ సేవలు

అట్లూరు : ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా రెవెన్యూ సేవలు బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్నాయని తహసీల్దారు వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ డే సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కరీముల్లా, వీఆర్‌ఓలు దస్తగిరి, వెంకటసుబ్బమ్మ, దొరబాబు, జూనియర్ అసిస్టెంటు శక్తికుమార్, టైపిస్టులు బండెయ్య, వేణు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

సిద్దవటం : తహసీల్దారు కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సిద్దవటం తహసీల్దారు మురాషావలి తమ సిబ్బందికి సూచించారు. సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో రెవెన్యూ శాఖ ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించడంతో పాటు, ప్రకృతి వైపరీత్యాలు, కరోనా సమయంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వారి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, ఏఎస్‌ఓ శివప్రసాద్, ఆర్‌ఐ అనూరాధ, సీనియర్ అసిస్టెంటు చంద్ర, జూనియర్ అసిస్టెంటు శ్రీనివాసులు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటం : మాట్లాడుతున్న తహసీల్దారు మురాషావలి

వీరబల్లిలో..

వీరబల్లి : వీరబల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ దినోత్సవంలో విశ్రాంత వీఆర్‌ఓ హరినాథరెడ్డిని తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది సన్మానించారు. అనంతరం విలేకరుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ జననం నుంచి మరణం వరకు ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను అందజేసేది రెవెన్యూ శాఖ మాత్రమే అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రజలను ఆదుకుంటూ వారికి కావాల్సిన సౌకర్యాలు సమకూర్చేది కూడా తమ శాఖే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ గోపి, మండల సర్వేయర్ బి. సులోచన, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న తహసీల్దారు వేణుగోపాల్



విశ్రాంత వీఆర్‌ఓను సన్మానిస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు

లక్కిరెడ్డిపల్లి: గ్రామంలోని సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ పట్నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేశారు. తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, ఉపాధి పనులు తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చారు. అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి కొత్త రుణాలు పొందాలని ఏపీఎం నిరంజన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, ఈఓపీఆర్‌డీ పెంచలయ్య, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకుంటే 27వ తేదీ ఉదయం 9 గంటలకు లక్కిరెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్‌కేఆర్, సాలాబాదు, మంటపంపల్లి, పాటూరు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంటిమిట్ట విద్యుత్ శాఖ డీఈఈ బి.మురళీధర్ రెడ్డి తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో పతకాలు

రాయచోటి టౌన్ : జాతీయ స్థాయిలో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించినట్లు ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జబీవుల్లా బాషా తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని వైఎస్‌పీఏలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌కు తమ కళాశాలకు చెందిన ఎస్. ఆలీ అహమ్మద్, జి. రెడ్డి ప్రసాద్‌లు ఎంపికయ్యారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ హర్షలత

ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపల్ హర్షలత, అధ్యాపకులు అభినందించారు.

రౌడీ సంప్రదాయాన్ని పక్కన బెట్టండి

మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి : రాయచోటిలో ఎన్నడూ లేని విధంగా రౌడీ సంప్రదాయాలకు టీడీపీ నాయకులు తెరతీయడం మంచి పద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి హితవు పలికారు. గురువారం సాయంత్రం రాయచోటిలో టీడీపీ రౌడీమూకల దాడుల్లో గాయపడిన మున్సిపల్ కౌన్సిలర్లను ఆయన మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని దౌర్జన్య సంప్రదాయాలకు తెలుగుదేశం తెరతీస్తోందన్నారు. ఇంటి ఆవరణలో ఉన్న వాహనాలు ధ్వంసం చేయడం కత్తులతో పొడవటం హేయమైన చర్యగా అభివర్ణించారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఏమీ చేయలేక ఇలా దాడులకు పాల్పడటం చాలా దారుణమన్నారు. చేయాల్సిన అభివృద్ధిని పక్కన పెట్టి అత్యుత్సాహంతో దాడులకు పాల్పడి బెదిరించడం తగదన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలను దగ్గర చేసుకోవాలే కానీ ఇలాంటి దాడులు చేయడం వల్ల ప్రజలలో మరింత చులకన అవుతారన్నారు. దాడులకు, ప్రతిదాడులు చేయడం పెద్ద సమస్య కాదని అలా చేయడం అందరిచేత అవుతుందన్నారు. అధికారంలో ఉన్న వారు రాయచోటి ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు సహకరించాలన్నారు. కాదు కూడదు అని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని రమేష్‌రెడ్డి హెచ్చరించారు. అంతకు ముందు 4వ వార్డు కౌన్సిలర్ హరూన్‌బాషా ఇంటి దగ్గర ధ్వంసం అయిన బైకును, భయభ్రాంతులకు గురైన కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. సంఘటన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు హరూన్‌బాషా కుటుంబం వద్దకు భారీగా చేరుకున్నారు. మైనార్టీ నాయకుడు హబీబుల్లాఖాన్, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, కౌన్సిలర్లు షబ్బీర్, రియాజ్, సాదిక్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



దాడిలో ధ్వంసం అయిన బైకును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

సమాచార సేకరణలో కచ్చితత్వం ఉండాలి

గాలివీడు : పాఠశాలలోని విద్యార్థులకు సంబంధించి సేకరించే సమాచారం కచ్చితత్వంతో కూడుకుని ఉండాలని ఎంఈఓలు నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో యూడైస్ ప్లస్ మీద మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలకు సంబంధించిన వివరాలను, యూడైస్ ప్లస్ డేటాను ఆన్‌లైన్‌లో పొందుపరచడంతో పాఠశాలల పనితీరు, పర్యవేక్షణపై నియంత్రణ ఉంటుందని తెలిపారు. సమావేశంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐలలో 97 సీట్లు భర్తీ

రాజంపేట టౌన్ : జిల్లాలోని ఐటీఐలలో సీట్ల భర్తీ కోసం గురువారం రాజంపేటలోని ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 69 సీట్లు భర్తీ అయినట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ రోజు రాజంపేట ప్రభుత్వ ఐటీఐలో 30 సీట్లు, పీలేరు ప్రభుత్వ ఐటీఐలో 20 సీట్లు, తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో 8 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. అలాగే రాయచోటి, రైల్వేకోడూరుల్లోని ప్రైవేట్ ఐటీఐలలో 11 సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు రాజంపేట ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించగా మొత్తం 97 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. జిల్లాలోని మూడు ప్రభుత్వ ఐటీఐలలో 392 సీట్లు ఉండగా ఇప్పటి వరకు 77 సీట్లు భర్తీ అయ్యాయని, పన్నెండు ప్రైవేట్ ఐటీఐలలో 1,064 సీట్లు ఉండగా 20 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. జనరల్ పూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహణకు ఉన్నతాధికారుల అనుమతి కోరామని, అధికారులు అనుమతిస్తే శుక్రవారం జనరల్ పూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ



వెలుగుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈఓ

సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె, వెలుగుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతో పాటు వంతాటిపల్లె (మెయిన్) ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని ఎంఈఓ విలియంరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ వంతాటిపల్లె ఉపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్‌రెడ్డి తండ్రి దూళ్ల వెంకటసుబ్బారెడ్డి(రిటైర్డ్ ఏఎస్‌ఐ) జ్ఞాపకార్థం విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లను ఉచితంగా పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జంగాలపల్లె మాజీ సర్పంచ్ ముసలి శ్రీనివాసులరెడ్డి, వెలుగుపల్లెకు చెందిన కుప్పం వెంకటసుబ్బారెడ్డి, మాచనూరు వెంకట సుబ్బారెడ్డి, పల్లె వెంకట సుబ్బారెడ్డి , ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలను గుర్తించండి

పెద్దతిప్పసముద్రం : బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ నారాయణ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ జంగంరెడ్డిగారిపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలయ్యేలా చూడాలని టీచర్లకు సూచించారు.

ఆకట్టుకున్న మహాభారత యజ్ఞం

రామాపురం : మండల కేంద్రంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం అర్జునుడు తన తపశ్శక్తితో పాశుపతాస్త్రాన్ని శివుని ద్వారా సంపాదించిన మహా ఘట్టాన్ని నాటక రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని పలు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. కురుక్షేత్ర సంగ్రామానికి అస్త్రాలు కావాలని అర్జునుడు తన తండ్రి ఇంద్రుని కోరిక మేరకు ఇంద్రకీలాద్రిపై తపస్సు చేస్తుండగా శివుడు ప్రత్యక్షమై వరం పొందిన ఘట్టాన్ని వివరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, వెంకటరామిరెడ్డి, భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



అర్జునుని తపస్సు ఘట్టాన్ని వివరిస్తున్న కళాకారులు

అక్రమాలపై విచారణ జరపండి

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అక్రమాలపై విచారణ జరపాలని సర్పంచ్ ఎస్.హబీబ్‌బాషా గురువారం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌కు, డీపీవో ధనలక్ష్మికి ఫిర్యాదు చేశారు. పీలేరు గ్రామ పంచాయతీలో 2023 అక్టోబర్ 4 నుంచి 2024 సెప్టెంబర్ 6 వరకు తాను విడతల వారీగా సెలవు పెట్టడం జరిగిందన్నారు. చివరగా మూడు నెలలు సెలవు పెట్టడం జరిగిందని, దానిని నాలుగు నెలలుగా పంచాయతీ ఈవో గఫూర్ తప్పుడు రికార్డులు సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 18న తన అనుమతి లేకుండా తనకు తెలియకుండా ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో ఈవో గఫూర్, ఇన్‌చార్జి సర్పంచ్ జీనత్ షఫీ, వారి కుమారులు సయ్యద్, జావిద్ కలసి తనకు మానసిక స్థితి సరిగా లేనట్లు, ఒత్తిడికి గురవుతున్నట్లు సర్టిఫికెట్ తీసుకున్నారని తెలిపారు. తద్వారా పై అధికారులు రిపోర్టు పంపించారని తెలిపారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి పంచాయతీ అధికారులపై, ఇన్‌చార్జి సర్పంచ్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిధులు భారీగా పక్కదారి పట్టించారని, దానిపై కూడా విచారణ చేపట్టాలని కోరారు.



డీపీఓ ధనలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న హబీబ్‌బాషా

వైభవంగా వేణుగోపాలస్వామి హనుమంతు సేవ



పూజలు అందుకుంటున్న వేణుగోపాలుడు



గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం హనుమంతు సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి హరికథా కాలక్షేపం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మ తెలిపారు.

నేడు గరుడ సేవ : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజు అయిన శుక్రవారం గరుడసేవ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. గరుడు సేవకు భక్తులు వందల సంఖ్యలో పాల్గొని వారి మొక్కులు తీర్చుకోనున్నారు.

వైభవంగా గంగమ్మ తల్లి జాతర

చిట్వేలి : మండల పరిధిలోని తిమ్మాయపాలెంలో గురువారం గంగమ్మతల్లి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున పోతులరాజు ముందు వెళ్తుండగా గంగమ్మతల్లి గుడికి బయలు దేరింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆసాదివారు కథ చెబుతూ గంగమ్మ వెంట నడిచారు. రైల్వేకోడూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి గంగమ్మతల్లిని దర్శించుకొని పూజలు చేశారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. జాతరలో పందేరపు బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే గట్టుమీదపల్లి, మల్లెపల్లెల్లో గంగమ్మతల్లికి ముద్దలు పెట్టి బలిదానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ సుధాకర్, సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

గట్టువారిపల్లిలో..

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలోని కొండూరు పంచాయతీ, గట్టువారిపల్లిలో గురువారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. వర్షాలు బాగా కురవాలని గంగమ్మ జాతర చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.రాజశేఖర్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, రాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గుడిలో కొలువుదీరిన గంగమ్మ తల్లి

క్షయ నివారణకు బీసీజీ టీకా తప్పనిసరి

రాయచోటి అర్బన్ : క్షయవ్యాధి నివారణకు వయోజనులంతా బీసీజీ టీకా వేయించుకోవాలని యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి అన్నారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం సిద్ధారెడ్డిగారిపల్లెలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి వ్యాప్తికి ఎక్కువగా అవకాశముండే వయోజనులకు బీసీజీ టీకాలను ఇవ్వడం ద్వారా కొత్తగా ప్రబలే టీబీ కేసుల తగ్గింపునకు అవకాశముందన్నారు. ఈ సందర్భంగా శిబ్యాల ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని 36 మందికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో శిబ్యాల ఉపకేంద్రం ఏఎన్‌ఎం సరస్వతి, సచివాలయం ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శిబ్యాలలో వయోజన బీసీజీ వ్యాక్సినేషన్ చేస్తున్న ఉప కేంద్రం ఆరోగ్య సిబ్బంది

జిమ్‌లో వ్యాయామం చేసి.. కుప్ప కూలి..

గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



సంతోష్(ఫైల్‌ఫోటో)

సంబేపల్లె : ఇటీవలి కాలంలో వ్యాయామాలు చేస్తూ గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఎక్కువై పోతోంది. దీనికి సంబంధించిన వీడియోలు అప్పుడప్పుడూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా వ్యాయామం చేసి జిమ్ నుంచి రూముకు చేరుకున్న సంబేపల్లె మండలానికి చెందిన యువకుడికి గుండెపోటు రావడంతో కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. సంబేపల్లె మండలం మోటుకువాండ్లపల్లెకు చెందిన చంద్రశేఖర్ గత కొన్నేళ్లుగా రాయచోటిలో ఏపీఎస్పీడీసీఎల్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఇతనికి ఇద్దరు కుమారులు. వీరిలో జి.సంతోష్(24) బీటెక్ పూర్తి చేసుకుని బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం బెంగళూరులోని తన రూముకు సమీపంలో ఉన్న ఓ జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేశాడు. ఆ తర్వాత తన రూముకు వెళ్లగానే గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. రూమ్‌లోని స్నేహితులు వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. చేతికందివచ్చిన కుమారుడు మరణించడంతో ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతంగా మారింది.